# 2

# ధర్మశాస్త్రమునకు ముందు ఆరాధన

ఆరాధనను గూర్చి దేవుడు ఆదాము, హవ్వలకు ఏమి బయలుపరచాడో బైబిలు మనకు తెలుపుట లేదు. ఏదెను తోటనుండి వారు తరిమివేయబడువరకు, నేరుగా దేవునితో సంభాషించుచూ వ్యక్తిగతంగా వారు ఆరాధనను వ్యక్తపరచినట్టున్నారు. వారు ఆరాధించారా లేక దేవునినుండి వేరుచేయబడిన తరువాత మరియు దానికి ముందు దేవుని ఎలా ఆరాధించారో బయలుపర్చబడలేదు.

ఆరాధనను గూర్చి బైబిలు తొలిసారిగా ప్రస్తావించింది కయీను, హేబెలుల సందర్భంలోనే (ఆదికాండము 4:3–5ఎ). మోషే ధర్మశాస్త్రము క్రింద ధాన్యపు అర్పణను దేవుడు అంగీకరించినందున కయీను అర్పణలో సమస్య తను ఏమి అర్పించాడు అనుదానియందు గాక, తన అర్పణను అతడు అర్పించినప్పుడు అతని స్వభావము సమస్యగా ఆలోచించబడింది.

> విశ్వాసమునుబట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలనుగూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు (హెబ్రీయులకు 11:4).

"విశ్వాసమునుబట్టి" హేబెలు బలి అర్పించాడు, అంటే కయీను విశ్వాసమును బట్టి అర్పించలేదని గుప్తమైయుంది. దేన్ని అర్పించాలి, అర్పణను ఎలా సిద్ధపరచాలి అనేదాన్ని గూర్చి కయీను, హేబెలులకు నేరుగా గాని, ఆదాము ద్వారా గాని దేవుడు బయలుపరచియుండాలి. హేబెలు జంతువును అర్పించుట మాత్రమే గాకుండ, తమ మందలోని తొలి చూలులలో క్రొవ్వినదాన్ని అర్పించాడు (ఆదికాండము 4:4). ఇలా చేయడంలో, అతడు నీతిమంతుడని సాక్ష్యము పొందెను (హెబ్రీయులకు 11:4).

కయీను "క్రియలు చెడ్డవియు అతని సహోదరుని క్రియలు నీతిగలవియునై యున్నట్టు" యోహాను వ్రాసాడు (1 యోహాను 3:12బి). దేవుడు కోరినదానిని విశ్వాసంవలన చేయడం నీతి క్రియను చేయడం అవుతుంది. దీనిని హేబెలు చేసాడు. దైవాధికృతం లేకుండ చేయడం దుష్క్రియ. ఇది కయీను చేసినది. గనుక అతని క్రియ చెడ్డది.

కయీను, హేబెలులు దేవునికి అర్పణలు అర్పించారు (ఆదికాండము 4:3, 4). వారి అర్పణలను అర్పించుట ద్వారా వారిరువురు దేవుని ఆరాధింపజూచారు. విదితంగా,

దేవుడు ఆరాధనను కోరుట మాత్రము గాదు, తన్ను ఆనందింపజేయు ఆరాధన రకాన్ని కూడ ఆయన కోరాడు.

బలులు అర్పించుటకు బలిపీఠాలు కట్టినట్లు ఆదికాండం ప్రస్తావిస్తుంది కాని వాటిమీద ఏమి అర్పించారో ఎల్లవేళల బయలుపర్చలేదు (ఆదికాండము 12:7, 8; [13:4 చూడు]; 13:18; 26:25; 33:20; 35:1–3, 7). అర్పణ యొక్క స్వభావము తెలుపబడినప్పుడు కేవలము జంతువులే అర్పింపబడినట్లు చెప్పబడింది (ఆదికాండము 8:20; 22:9–13). ఈ వాస్తవాలను ఆధారము చేసికొని, హేబెలుచే అర్పింపబడిన జంతు బలిని దేవుడు కోరాడు కాని కయీను అర్పించిన ధాన్యపు అర్పణను ఆయన కోరలేదన్నట్టు తీర్మానించడం సరియైనది కావచ్చు.

కయీను, హేబెలుల తరువాత జలప్రళయానంతరం నోవహు అర్పణవరకు ఆరాధన స్వభావాన్ని గూర్చి ఏమియు బయలుపర్చలేదు. షేతు యొక్క సంతతివారు దేవుని ఆరాధించినట్టు మనం ఊహించవచ్చు, ఎందుకంటే వారు "యెహోవా నామమును బట్టి" ప్రార్థన చేశారు (ఆదికాండము 4:26బి). తప్పక, హనోకు దేవుని ఆరాధించాడు, ఎందుకంటె అతడు "దేవునితో నడిచాడు" (ఆదికాండము 5:24). ఆ తరువాత సంవత్సరాలలో భూజనులు బహుగా చెడిపోయారు, అయితే నోవహు దేవుని దృష్టియందు కృప పొందినవాడాయెను (ఆదికాండము 6:5, 8).

ఓడను నిర్మించుటలో దేవుడు అతనికి ఏమి తెలిపాడో దాన్ని చేయుటవలన, నోవహు దేవునియందు తన విశ్వాసాన్ని కనుపరచాడు (హెబ్రీయులకు 11:7). ఓడనుండి బయటకు వచ్చిన తరువాత అతని మొదటి కార్యము దేవునికి బలి అర్పించుట అయ్యునందున ఈ నీతిమంతునికి ఆరాధన అన్నిటికంటె ప్రధానంగా ఉన్నట్టు మనం ఊహించగలం (ఆదికాండము 8:20). జలప్రళయం కలిగించిన భయంకరమైన నాశనముగుండా దేవుడు అతన్నీ, అతని కుటుంబాన్నీ క్షేమకరంగా తెచ్చినందుకు కృతజ్ఞతాపూర్వకమైన హృదయము నుండి అతడీబలిని అర్పించాడు. దేవుడు ఏమి కోరాడో దానికి నమ్మకమైన విధేయతను ఆధారం చేసికొని అతడీబలులను అర్పించినట్టు కూడా మనం ఊహించవచ్చు. అతని బలిని దేవుడు యింపైన సువాసనగా "ఆఘ్రాణించాడు" (ఆదికాండము 8:21), నోవహు బలులతో దేవుడు ఆనందించినట్టు ఇది సూచిస్తుంది.

అబ్రాహాము కట్టించిన బలిపీఠాలను గూర్చి అన్నిటికంటే ఎక్కువసార్లు బైబిలు పేర్కొన్నట్టుంది. అబ్రాహాము దేవునికి సన్నిహితంగా ఉన్నట్టును, అన్ని స్థలాలలో అతడు ఆయనను ఆరాధింప జూచినట్టును ఇది సూచిస్తుంది. కట్టబడ్డ బలిపీఠాలు ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలని వ్రాయబడిన సంగతులు గుప్తం చేయలేదు. అతడు వాటిని మాటి మాటికి వినియోగించియుండవచ్చు. అతడు వెళ్లిన ప్రతిచోట బలిపీఠాలను కట్టడం దేవుని ఆరాధించుట అతనికి తొలి ప్రాధాన్యతగా ఉన్నట్టు గుప్తం చేయబడింది.

వారి పితరుడైన అబ్రాహాము యొక్క అడుగుజాడలననుసరించి ఇస్సాకు, యాకోబులు కూడ బలిపీఠాలు కట్టారు. యెహోవా మార్గముననుసరించి నడచునట్లు అబ్రాహాము తన పిల్లలకు ఆజ్ఞాపించగలడని దేవుడు తెలిపాడు (ఆదికాండము 18:19). దేవునియందలి అబ్రాహాము భక్తి అతని సంతానంపై తన ప్రభావాన్ని చూపింది.

ధర్మశాస్త్రం యివ్వక ముందు కాలంలో బలిపీఠాలు ఆరాధనకు సాధనాలు మాత్రమే కాదు. Andrew Hill యిలా సూచించాడు,

> … అభ్యాస సంబంధమైన ఆరాధనను వ్యక్తపరచడంలో, ఆదికాండం యితర పలు విధానాలను వర్ణించుతుంది, రాతి స్తంభాలను నిలపడం, వాటిమీద నూనె పోయడం (బలి సంబంధిత ద్రవం లేదా పానార్పణము, 28:18, 22; 35:14), దైవికమైన ప్రత్యక్షతకు ప్రత్యుత్తరంగా ప్రమాణాలు చేయడం (28:20; 31:13), దేవుని కలిసికొనడంలో సిద్ధపాటుగా వైదిక శుద్ధీకరణ (35:2), నిబంధనకు విధేయతా గురుతుగా సున్నతి ఆచారము (17:9-14), స్తుతి మరియు కృతజ్ఞతా ప్రార్థనలు (12:8; 13:4), విన్నపము (24:12; 25:21), మరియు విజ్ఞాపనము (18:22-33; 20:7).[1]

ధర్మశాస్త్రపు ముందు కాలంలో మెల్కీసెదెకు ఒక్కడే దేవుని యాజకుడుగా ప్రస్తావించ బడెను (ఆదికాండము 14:18-20; హెబ్రీయులకు 5:6). కాకపోతే, యాజకులు కాని కుటుంబ పెద్దలే బలులు అర్పించినవారుగా చిత్రింపబడ్డారు. యోబు తన కుటుంబం పక్షంగా బలులు అర్పించాడు, అతని స్నేహితులు బలులు అర్పించారు (యోబు 1:5; 42:7-9).

## సంగ్రహం

ఆరంభ కాలంనుండి, దేవుడు వారికి చేసినదానికి కృతజ్ఞతగా ఆయనకు అర్పణలు చెల్లించే అవసరతను మానవజాతి గుర్తిస్తుంది. దేవుణ్ణీ, ఆయన మహత్తర కార్యాలనూ అభినందిస్తూ ధర్మశాస్త్రమునకు పూర్వం దేవున్ని ఆరాధించేవారు. బలిపీఠాల మీద బలులు అర్పించడం ఆ కాలంలో ప్రాథమికమైనదైనా, దేవుడే ఆరాధనా దైవముగా నిలిచియున్నాడు. ఆయన గౌరవించబడ్డాడు, పూజించబడ్డాడు, వెదకబడ్డాడు, మహా ఘనుడై, ఉత్తముడై, దేవుడైయున్నందుకు ఆయనను స్తుతించారు. ఆరాధన దేవునికి, దేవునికొరకు, మరియు దేవునివి. పటాలు గాని, విగ్రహాలు గాని ఆరాధనలో వినియోగింపబడలేదు; దేవుడు మాత్రమే ఆరాధనకు కేంద్రమైయున్నాడు.

---

సూచన

[1]Andrew E. Hill, *Enter His Courts with Praise!* (Grand Rapids, Mich.: Baker Book House, 1993), 33. దేవునికి ఆరాధనలో కొండలు, సున్నతి చేర్చబడకపోవచ్చు. విధేయతకు, దేవుని ఆరాధించుటకు మధ్య వ్యత్యాసం చేయబడాలి. బానిస తన యజమానునికి లోబడడానికిని, యజమానుని ఆరాధించడానికిని మధ్య వ్యత్యాసమున్నట్టు.